లిఫ్ట్‌లో ఇరుక్కున్న మహిళలు

జోనల్ కార్యాలయంలో తప్పిన ప్రమాదం

లిఫ్ట్ నుంచి బయటకు వస్తున్న మహిళలు

సికింద్రాబాద్, మార్చి 13: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రమాదవశాత్తు లిఫ్ట్ మధ్యలో ఆగింది. లిఫ్ట్ ఆగిన సమయంలో ఐదుగురు మహిళలు, ఇద్దరు యువకులు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో ఫ్లోర్‌కు చేరుకునే క్రమంలో సర్వీస్ లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో అందులో ఉన్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఎంతకూ కదలకపోవడంతో మహిళలు ఒక్కసారిగా కేకలు వేశారు. టెక్నీషియన్లు ముగ్గురు ఉండగా ఆసమయంలో ఒక్కరే ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. మహిళల కేకలు విన్న సిబ్బంది వచ్చి అందులో ఉన్న వారిని బయటకు పంపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

దేముడు

కవాడిగూడ, మార్చి 13: బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన దోమలగూడ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. దోమలగూడ ఎస్ఐ కే శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడకు చెందిన ఉల్లంపార్తి దేముడు (39) గత డిసెంబర్ 23న 2.5 గంటలకు తన టీఎస్ ఏ9ఎఫ్ క్యూ 4773 గ్లామర్ బైక్‌పై ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లాడు, ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో తండ్రి చిలుకు బుధవారం దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

నిధులు మంజూరై మూడేండ్లైనా..

- మరమ్మతులకు నోచుకోని రోడ్డు పనులు
- రవీందర్‌నగర్‌లో దెబ్బతిన్న రోడ్లతో ప్రజల ఇబ్బందులు
- ఎగువ కాలనీలో రోడ్డు వేయడంతో దిగువ కాలనీకి శాపం

నీసీకి నోచుకోని రవీందర్‌నగర్ రోడ్డు

అమీర్‌పేట్, మార్చి 13: ఎగువన ఉన్న కాలనీలో రోడ్డు వేయడంతో దిగువ కాలనీకి శాపంగా మారిన పరిస్థితి సనత్‌నగర్‌లోని రవీంద్రనగర్‌కు దాపురించింది. ధ్వంసమైన రోడ్లను పునర్నిర్మిస్తామన్న మూడేండ్ల కిందటే ఆనాటి మంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నిధులు సైతం విడుదల చేశారు. కానీ నేటికీ రోడ్ల మరమ్మతు ఆచరణకు నోచుకోలేదు. ఈ కాలనీలో రోడ్ల విషయాన్ని పక్కన బెడితే.. ఎగువన ఉన్న కాలనీ సి-టైప్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వీడీడీ రోడ్డుతో దిగువన ఉన్న రవీందర్‌నగర్ కాలనీకి కొత్తగా సమస్యలు వచ్చి పడ్డాయి. వివరాల్లోకి వెళితే..

సి-టైప్ క్వార్టర్లలో ఇళ్ల నుంచి పారుతున్న నీరు నేరుగా వచ్చి రవీందర్‌నగర్, దాసారం హట్స్ మధ్య నిలుస్తున్నాయి. నీరు నిల్వడంతో కాలనీలో అత్యంత దుర్భర పరిస్థితులు తెచ్చిపెట్టిందని కాలనీవాసులు కాలనీవాసులు మండిపడుతున్నారు.

2021లోనే నిధులు మంజూరు..

2021 జూలైలో అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సనత్‌నగర్ డివిజన్ బీకే గూడ రవీందర్‌నగర్‌లో పర్యటించి, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి వెంటనే పునర్నిర్మించాలంటూ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. మరుసటి రోజునే జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో కొత్త రోడ్లకు కొలతలు తీసుకుని, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాలనీకి సంబంధించి దాసారం హట్స్ ప్రహరీ నిర్మాణానికి చైన్‌లింక్ ఫెన్సింగ్ కోసం దాదాపు రూ.8 లక్షల వ్యయంతో పనులు జరిగాయి. బీటీరోడ్ల కోసం దాదాపు రూ.30 లక్షల నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ఎక్కడ చూసినా కొత్త రోడ్లు..

నియోజకవర్గంలో కొత్త రోడ్లే కనిస్తింటాయి. మంత్రి హోదాలో తలసాని ఎక్కడ పర్యటించినా తన దృష్టికి వచ్చిన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారన్న పేరుంది. ఆదేశాలు అందడమే ఆలస్యం అన్నట్టుగా అధికారులు వ్యవహరించేవారు. ఆయా నిర్మాణాల కొలతలు, ఆ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయడం.. అవసరమైన నిధులు మంజూరుకావడం.. ఇదే పద్ధతిగా గత దశాబ్ద కాలంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి చకచకా జరిగింది. కేవలం రవీందర్‌నగర్ విషయంలో మాత్రమే జీహెచ్ఎంసీ అధికారులు ఇంతలా నిర్లక్ష్యం ప్రదర్శించారని రవీందర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌సింగ్ ఆరోపిస్తున్నారు.

మూడేండ్ల కొద్దీ సాగదీత..

2021 నాటి పనులను 2023 అక్టోబర్ వరకు సాగదీశారని, అప్పట్లో ఎన్నికల కోడ్ వచ్చేస్తోందంటూ కాలనీవాసులు జీహెచ్ఎంసీ అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కార్పొరేటర్ దగ్గర అనేక సందర్భాల్లో ప్రస్తావించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తరువాత అధికారులను సంప్రదిస్తే, కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదంటూ సమాధానం చెబుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూడా రానుండడంతో మరో మూడు నెలల పాటు ఎదురుచూపులు తప్పవని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

సందీప్, జీహెచ్ఎంఐసీ ఏఈ, సనత్‌నగర్

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. రవీందర్‌నగర్ విషయంలో ఇప్పటికే పలుమార్లు టెండర్ ప్రక్రియను చేపట్టాం. తాజాగా రవీందర్‌నగర్‌తో పాటు డివిజన్‌లోని మరిన్ని ప్రాంతాల్లో వేయాల్సిన బీటీ రోడ్లను కలిపి మరోసారి టెండర్ ప్రక్రియను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

దెబ్బతిన్న రవీందర్‌నగర్ రోడ్డు

ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా బుధవారం బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల హరికృష్ణ, దేవులపల్లి శ్రీనివాస్, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు. – కంటోన్మెంట్, మార్చి 13

వంజరి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వంజరి సేవా సంఘం నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13: రాష్ట్ర ప్రభుత్వం వివిధ కులాలను ఆదుకునేందుకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ వంజరి సేవా సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. వంజరి కార్పొరేషన్‌ను సైతం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. అంతే గాకుండా తమ సామజికవర్గానికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తార్నాకలోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరనారాయణ, ప్రధాన కార్యదర్శి ధాత్రిక ధర్మరాజు మాట్లాడుతూ.. కులవృత్తులకు సాంకేతికత జోడించాలన్న ఉద్దేశంతో కులవృత్తులకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంచార గిరిజన జాతికి చెందిన వంజరులు పేదరికాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సామాజికవర్గానికి 77 ఏండ్లుగా ఏఒక్క ప్రభుత్వం ఎలాంటి పథకం ప్రకటించలేదని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం సంచార వ్యాపారులుగా పేరుగాంచిన వంజరులు బ్రిటిష్ కాలం నుంచి అణిచివేతకు గురవుతున్నారని వాపోయారు. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపించి, వంజరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సాల్వేరు కృష్ణ, ఉద్యోగుల సంఘం నాయకుడు కాలేరు సురేశ్, ఉపాధ్యక్షులు ఎదగని హరినాథ్, పిట్టల అంజయ్య, కార్యదర్శులు ఎదుగని రామకృష్ణ, మాయ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానలో గ్లకోమా అవగాహన ర్యాలీ ప్రారంభించిన డాక్టర్ ఎం.రాజారావు

నేత్ర సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు

గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

బన్సీలాల్‌పేట్, మార్చి 13: నేత్ర సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గాంధీ దవాఖానలోని అప్తల్మాజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కంటి చూపులో లోపం, కండ్లు ఎర్రబడడం, దురద లాంటి లక్షణాలు ఉంటే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ సందర్భంగా అప్తల్మాజీ వైద్యులను, సిబ్బందిని ఆయన అభినందించారు. అప్తల్మాజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ కె.రవి శేఖర్‌రావు మాట్లాడుతూ గ్లకోమా (నీటి కాసుల వ్యాధి), లక్షణాల గురించి వారం పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఉచితంగా పరీక్షలు, చికిత్స అందజేస్తామని చెప్పారు. నేత్ర వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే అవకాశం ఉన్నదని అన్నారు. ర్యాలీలో గాంధీ ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, అప్తల్మాజీ విభాగం వైద్యులు డాక్టర్ సింధు, డాక్టర్ ప్రావిణ్య, డాక్టర్ సుజని, జూనియర్ డాక్టర్లు, అప్టోమెట్రి విద్యార్థులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

అమీర్‌పేట్, మార్చి 13: దేశ జనాభాలో దాదాపు 6శాతం మంది వివిధ స్థాయిల్లో వినికిడి లోపాలతో బాధపడుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయని ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్ సీఈవో నైతిక్ షా అన్నారు. వినికిడి లోపాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో తగిన చికిత్సలు అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. సిగ్నియా భాగస్వామ్యంతో ఆరా హియరింగ్ అండ్ స్పీచ్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరంలో కొత్తగా ప్రారంభిస్తున్న మూడు క్లినిక్‌లకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పంజాగుట్ట, మియాపూర్, చందానగర్‌లలో ప్రారంభమైన ఆరా క్లినిక్‌లో మొదటి 100మంది రోగులకు ఉచిత వినికిడి తనిఖీలు చేస్తామని తెలిపారు. ఉచిత వినికిడి చెకప్ అపాయింట్‌మెంట్‌కు 99924 19993లో సంప్రదించాలన్నారు.

'ఉస్మానియా'లో దీక్ష కొనసాగిస్తున్న అశోక్

సుల్తాన్‌బజార్, మార్చి 13. మెగా డీఎస్సీ, ఉద్యోగ నోటిఫికేషన్లు కోరుతూ నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అశోక అకాడమీ చైర్మన్ అశోక్‌ను మంగళవారం అర్ధరాత్రి ఉస్మానియా దవాఖానాకు తరలించారు. చైతన్యపురిలోని తన నివాసంలో నిరుద్యోగులతో కలిసి దీక్ష చేస్తున్న అశోక్‌ను వైద్య చికిత్స కోసం భారీబందోబస్తు మధ్య తరలించారు. అత్యవసర వార్డు 116 లో వైద్య సేవలందించిన అనంతరం కులీ కుతుబ్‌షా బ్లాక్ ఎంఎం-4వార్డులోకి మార్చారు. ప్రస్తుతం అశోక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అశోక్ వార్డులోని బెడ్‌పై కూడా దీక్షను కొనసాగిస్తున్నారు. ఆయనతో పాటు అస్మా, ఇంద్రసేన కుమార్ నాయక్ దీక్ష కొనసాగిస్తున్నారు.

మహిళ కార్పొరేటర్‌పై దాడి అమానుషం

కార్పొరేటర్ దేదీప్యను పరామర్శిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, మార్చి 13: మహిళ కార్పొరేటర్‌పై జగిరిన దాడిని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఖండించారు. మంగళవారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద కాంగ్రెస్ నాయకులు, మహిళలు వెంగళ్‌రావునగర్ కార్పొరేటర్ దేదీప్యపై పథకం ప్రకారం చేసిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. బుధవారం వెంగళ్‌రావు నగర్ కార్పొరేటర్ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో దేదీప్యను కలిసి సునీత పరామర్శించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే గుండాల రాజ్యం అని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ప్రజాప్రతినిధి మీద దాడి జరిగిన దాఖాలాలు లేవని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే కబ్జాలు, అవినీతి పాలన, అక్రమార్కుల అడ్డా అని ఆమె మండిపడ్డారు. పోలీసులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో కార్పొరేటర్ స్థాయి వ్యక్తులకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు.

ధూమపాన రహిత సమాజానికి కృషి చేయాలి

అబిడ్స్, మార్చి 13. ధూమపానం వల్ల క్యాన్సర్, గుండె వ్యాధులు వస్తాయని, ధూమపాన రహిత సమాజం కోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ప్రభుత్వ చెస్ట్ దవాఖాన శ్వాసకోశ నిపుణులు డాక్టర్ వి. కార్తీక్ అన్నారు. బుధవారం తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీతో పాటు ధూమపానం వల్ల వచ్చే అనర్థాలపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యావేత్త షరీఫ్, తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ప్రిన్సిపాల్ వసంతకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాలు

సుల్తాన్‌బజార్, మార్చి 13: కోవిడ్ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్‌లు చేసిన సేవలు మరువలేని వని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం కింగ్‌కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా దవాఖానలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ మూర్తి ఆధ్వర్యం లో జా తీయ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సంధర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్లను సన్మానించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన అధికారులు

- రూ.50కోట్ల విలువైన భూమిని రక్షించిన తహసీల్దార్

బ్లూ షీట్స్ తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

బేగంపేట్, మార్చి 13: సుమారు ఎకరం ప్రభుత్వ స్థలాన్ని రాత్రికి రాత్రి ఖబ్జా చేసేందుకు ప్రయత్నించగా సికింద్రాబాద్ రెవెన్యూ అధికారులు పరిరక్షించారు. స్థలం విలువ సుమారు రూ.50కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ మండలం రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ప్రభుత్వానికి చెందిన ఎకరం స్థలం ఉంది. దీనిపై కొంతకాలంగా అక్రమార్కులు కన్నేశారు. ప్రభుత్వం కబ్జాదారుల మధ్య కేసు నడుస్తూ వచ్చింది. 2011లో ప్రభుత్వానికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. అప్పటి నుంచి రెవెన్యూ అధికారులు భూమిని పరిరక్షిస్తూ వస్తున్నారు. కాగా ఈ మధ్య సదరు వ్యక్తులు దీనిపై హైకోర్టుకు వెళ్లారు. కోర్టులో కేసు నడుస్తుండగానే రాత్రికి రాత్రే ఆ స్థలంలో చుట్టూ బ్లూషీట్స్‌తో కంచే వేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్ తన సిబ్బందితో కలిసి జేసీబీతో రేకుల (బ్లూషీట్స్)ను తొలగించారు. అనంతరం కబ్జాదారులపై రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ పాండునాయక్ హెచ్చరించారు.

కొమురం భీమ్ ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

సాగబోయిన పాపారావు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13: తెలంగాణ రాష్ట్రంలో కొమురం భీమ్ ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమని ఆదివాసీ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో ఏజెన్సీ, 5వ షెడ్యూల్డ్ ప్రాంత పరిరక్షణకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సైతం పరిష్కారమయ్యేందుకు మార్గం సుగమమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆదివాసీ ప్రజలను రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింతగా ప్రాధాన్యత కల్పించి, వారి హక్కులు, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

అవినీతిని ఉపేక్షించేది లేదు..

డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పించి వారి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్న ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు తమ పద్ధతులు మార్చుకోవాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. పలువురు డ్వాక్రా మహిళలు తమ నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. విషయాన్ని పరిశీలించిన కార్పొరేటర్ యూసీడీ పీవో శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్ మానయ్యలతో బుధవారం సనత్‌నగర్ లోని తన కార్యాలయంలో సమావేశమైన డ్వాక్రా మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. – అమీర్‌పేట్, మార్చి 13

జనగణనతో కులగణన చేపట్టాలి :ఆర్. కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 13: దేశ వ్యాప్త చేపట్టనున్న జనగణనతోపాటు కులగణన చేపట్టి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. యాభై శాతానికిపైగా ఉన్న బడుగులకు న్యాయమైన వాటా ఇవ్వడంలో కేంద్రానికి ఉన్న ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి గన్‌పార్కు వరకు చేపట్టిన బీసీ న్యాయయాత్రను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కేంద్రానికి బీసీల పట్ల ఏ మాత్రం ప్రేమ ఉన్నా కులగణన చేపట్టి వెనకబడిన వర్గాలకు యాభై శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీల పట్ల స్పష్టమైన వైఖరి వెల్లడించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాగా బీసీ న్యాయయాత్రలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, సుధాకర్, రాజ్‌కుమార్, నందగోపాల్, ప్రవీ ణ్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

పికెట్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

మారేడ్‌పల్లి, మార్చి 13: ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ నాలుగో వార్డు పరిధిలోని పికెట్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు బోర్డుతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోడీకి మద్దతుగా నిలిస్తే రానున్న రోజుల్లో కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, నాయకులు రాజ మల్లేశ్, టోపీ శంకర్, నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మెగాసీటీ నవకళా వేదిక, మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో బుధవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మహిళా ఎక్సలెన్సీ అవార్డులు-2024 ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు విచ్చేసి వివిధ రంగాలలో సేవలందించిన మహిళా మణులకు ఉమెన్స్ ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ ప్రతీభాలక్ష్మి, డా.శోభాదేవి, అడ్వకేట్ డీఎల్ పాండు తదితరులు అవార్డులు అందుకున్నారు. నిర్వాహకుడు మల్లికార్జున్‌రావు ఉన్నారు. – రవీంద్రభారతి, మార్చి 13

తిరుమలగిరి చెరువు సుందరీకరణ

పనులకు శంకుస్థాపన

బొల్లారం, మార్చి 13: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనులకు బుధవారం కంటోన్మెంట్ బోర్డు బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. తిరుమలగిరి మలనీ ఎంక్లేవ్‌లో ఉన్న చెరువు సుందరీకరణ పనులు చేపట్టడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.90 కోట్ల నిధులు మంజూరు చేసింది. పరిసర ప్రాంతాలకు చెందిన కాలనీల మురికి నీరు చెరువులో కలువకుండా డయా పైపులైన్ వేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు, స్థానిక నాయకులు సరిత, ప్రశాంత్ ప్రభు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న బోర్డు బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభం

గాంధీనగర్‌లో పర్యటించిన కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నెల గద్దర్

బొల్లారం, మార్చి 13: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి గాంధీనగర్, ఆశా ఆఫీసర్స్, శక్తినగర్ కాలనీల్లో బుధవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నెల గద్దర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామకృష్ణాపురం మెయిన్ రోడ్డు, తిరుమలగిరి గాంధీనగర్, ఆశ ఆఫీసర్స్ కాలనీ నుంచచి అమ్ముగూడ రైల్వేస్టేషన్ వరకు రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.86లక్షల 45వేల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచచి త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయని వెల్లడించారు.

కార్యక్రమంలో న్యూ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తేజ్‌పాల్, గాంధీనగర్, ఆశ ఆఫీసర్స్‌కాలనీ అధ్యక్షుడడు చిన్న, విఠల్, శ్రీధర్, శాంతమూర్తి, నర్సింగరావు, నాయకులు మర్రి అమరేందర్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.